## క్లుప్తంగా

### గ్రామాల్లో ఆధార్ డ్రైవ్



రంగబయలు గిరిజనులతో మాట్లాడుతున్న ఎంపీడీవో కిరణ్‌కుమార్

**ముంచంగిపుట్టు:** మండలంలోని రంగబయలు పంచాయతీ కేంద్రంలో ఎంపీడీవో కిరణ్‌కుమార్ బుధవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక డ్రైవ్ రెండు నెలల పాటు నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డు నమోదు, ఫోన్ నెంబర్ అనుసంధానం, అడ్రస్ మార్పు, చేర్పులు తదితర సేవలు అందిస్తున్నట్టు చెప్పారు.ఆధార్ డ్రైవ్‌పై గ్రామ వలంటీర్లు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వైస్ఎంపీపీ భాగ్యవతి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### నేటి నుంచి సామాజిక తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో పూర్ణయ్య

**పెదబయలు:** మండలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా 2022–2023 ఆర్థిక సంవత్సరంగాను 14వ సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య చెప్పారు. డీఆర్పీలు, టెక్నికల్ అసిస్టెంట్లు ,వీఆర్పీలు పంచాయతీ రాజ్, సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. 2022–2023లో చేపట్టిన పనులకు సంబంధించిన పూర్తి రికార్డులు, ఎం.బుక్స్ డీఆర్పీలకు అందజేసినట్టు తెలిపారు. ఈనెల 25 నుంచి ఫిబ్రవరి 14 తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీ క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఏపీవో ఈసీ సింహాచలం, పూర్వపు ఏపీవో నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### అనాథ పిల్లలను ఆదుకోవాలి

**ముంచంగిపుట్టు:** కుమడ పంచాయతీ సిర్లిమెట్ట గ్రామానికి చెందిన ముగ్గురు అనాథ పిల్లలను ప్రభుత్వం ఆదుకొని భరోసా కల్పించాలని ఎస్సీ, ఎస్టీ జిల్లా కమిటీ సభ్యుడు చెండా లోహితాసుడు అన్నారు. సిర్లిమెట్ట గ్రామంలో ఆయన బుధవారం పర్యటించారు. అనాథ పిల్లలైన చిట్టిబాబు, సంజన, అనితలను పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

### పశువుల సంరక్షణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ చంద్రశేఖర్

**చింతపల్లిరూరల్:** పశువులను సంరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చింతపల్లి ప్రాంతీయ పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. జంతు సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గిరిజన సంక్షేమశాఖ బాలురు ఆశ్రమ పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు జంతువుల సంరక్షణపై అవగాహన కల్పించారు. హెచ్ఎం రామరాజుపడాల్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

**కూనవరం:** కూనవరం, టేకుల బోరు, జగ్గవరం పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జల్లి సత్యనారాయణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఓటరు తమ ఓటు హక్కు ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీఎల్ఓలు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

### అధికారులు స్పందించాలి

**వై.రామవరం:** మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ ఆనందరావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతు రోజు మామిడి చెట్లు నరికి దళారీలు తరలించుకు పోతున్నారన్నారు. అటవీశాఖాధికారులు స్పందించాలన్నారు. ఎంపీపీ మాట్లాడుతు కలప అక్రమ రవాణాదారులపై అటవీశాఖాధికారు లు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ జోగిరెడ్డి, ఎంపీటీసీలు సుబ్బలక్ష్మి, లక్ష్మి, ప్రసాదరెడ్డి, వెంకటరమణ, ఎంపీడీఓ యాదగిరీశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.






# సర్కారు బడులకు మహర్దశ

- నాడు-నేడుతో రూపురేఖలు మారిన పాఠశాలలు
- రూ 8.38కోట్లతో అభివృద్ధి పనులు
- గణనీయంగా పెరిగిన విద్యార్థుల సంఖ్య




కుసుమరాయి ఎంపీపీ స్కూల్

**గంగవరం :** నాడు అధ్వానంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు నేడు ఎంతో ఆకర్షణీయంగా మారాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేక అధ్వానంగా ఉండేవి. శిథిల భవనాల్లో పాఠశాలలు కొనసాగేవి.. వర్షం పడితే తరగతి గదులన్నీ జలమయం.. టీడీపీ పాలకులు ప్రభుత్వ పాఠశాలల దుస్థితిపై కనీసం పట్టించుకోకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అదంతా గతం... జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యకు పెద్దపీట వేశారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా కోట్లాది రూపాయలను మంజూరు చేశారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మార్చారు. మెరుగైన బోధన అన్ని సదుపాయాలతో దర్శనమిస్తున్న సర్కారు పాఠశాలల్లో పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలతో పాటు ఉత్తమ విద్య అందిస్తుండడంతో సీఎం జగన్మోహన్‌రెడ్డికి విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

**కొత్త సొబగులు**

మండలంలో కేజీబీవీ–1, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల–1, మండల పరిషత్ పాఠశాలలు–4, ఎంపీపీ పాఠశాలలు–33, ఒక కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం , ఒక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నాలుగు మండల పరిషత్ ప్రాథమికోన్నత , 33 ఎంపీపీ పాఠశాలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలు–5, ప్రభుత్వ (గిరిజన) ప్రాథమిక పాఠశాలలు–15 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వం నాడు–నేడు మొదటి విడత, రెండో విడతల ద్వారా మంజూరు చేసిన రూ.8.38 కోట్ల నిధులతో 33 పాఠశాలలను అభివృద్ధి చేశారు. ఇందులో భాగంగా గిరిజన సంక్షేమ జీపీఎస్ స్కూళ్లు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల అభివృద్ధి, ఫర్నీచర్, ప్రహరీల నిర్మాణం తదితర పనులు చేపట్టారు. పాఠశాలల భవనాల గోడలపై, ప్రహరీలపై విద్యా ఆవశ్యకత, పాఠ్యాంశాల పెయింటింగ్లు, తరగతి గదులు, మరుగుదొడ్లు, టైల్స్‌తో ఆధునీకరించారు. సర్కారు బడులు కొత్త సొబగులతో దర్శనమిస్తున్నాయి.

**విడతల వారీగా నిధులు**

నాడు–నేడు నిధులతో 33 పాఠశాల భవనల్లో రిపేర్లు , 27 పాఠశాలల్లో మరుగుదొడ్లు, 23 పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణాలు జరిగాయి. రెండు పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నాడు–నేడు మొదటి విడతలో రూ.3.81,43,000 మంజూరు కాగా, రెండో విడతలో రూ.4,56,45,000లతో పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

### నాడు-నేడు ఓ వరం



పాఠశాలల అభివృద్ధికి నాడు–నేడు పథకం ఓ వరంగా మారింది. నాడు–నేడుతో పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలన్నీ సౌకర్యాలతో మరింత మెరుగుపడ్డాయి. రెండో విడతలో ప్రారంభించిన నాడు–నేడు పనులు జరుగుతున్నాయి. గడువులోగా పనులన్నీ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– మల్లేశ్వరరావు ఎంఈవో, గంగవరం

### ఉత్తమ బోధన



ఎన్నడూ ఊహించని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి జరిగింది. ఉచిత విద్యతో పాటు కార్పొరేట్‌కు దీటుగా సదుపాయాలు, ఉత్తమ విద్యను ప్రభుత్వం కల్పించడం హర్షణీయం. అమ్మఒడి పథకంతో పాటు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన జగనన్నకు రుణపడి ఉంటాం. ప్రభుత్వ స్కూల్స్‌ను ప్రైవేటు స్కూల్ కంటే అందంగా తీర్చిదిద్దారు.

– బషీర్‌బీబీ





మర్రిపాలెం ఎంపీపీ పాఠశాలలో మరుగుదొడ్డి , వంటషెడ్డు




బర్రిమామిడి పాఠశాల ముఖద్వారం

## క్రీడల్లో ప్రతిభను చాటాలి

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

**అరకులోయ రూరల్:** ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని అరకు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ చెప్పారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో ప్రతిభ కనబర్చాలన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొని యువతలో ఉన్న క్రీడా నైపుణ్యం మరింత పెంపొందించుకోవాలన్నారు. ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీడీవో వెంకటేష్, సర్పంచ్‌లు రాధిక, బొజ్జ, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, నాయకులు నర్సింగ్, సాంబ, ఈవో రాజ్‌కుమార్, పంచాయితీ కార్యదర్శి నిర్మల, డీడీవో గురుమూర్తి, వ్యాయమ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

### భూ పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ జ్యోతి, నాయకులు

**అరకులోయ రూరల్:** మండలంలో మాడగడలో సర్పంచ్ జ్యోతి ఆధ్వర్యంలో జగనన్న శాశ్వత భూ హక్కు పథకం ద్వారా 110 మంది రైతులకు భూ రీ సర్వే పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న శాశ్వత భూహక్కు సర్వే చేపట్టి రైతుల భూములకు భద్రత కల్పించడంతో పాటు పట్టాలు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. పేదలకు అండగా జగనన్న ప్రభుత్వం నిలుస్తోందన్నారు. నాయకుడు బాలరాజు, వార్డు సభ్యులు డేవిడ్, ధర్మరాజు, సచివాలయం, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్ సభకు తరలిరండి

- అరకు ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ

**అరకులోయ రూరల్:** ఈనెల 27న విశాఖపట్నం భీమిలిలో జరిగే సదస్సుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారిగా తరలివచి విజయవంతం చేయాలని అరకు ఎమ్మెల్యే ,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చెట్టి పాల్గుణ పిలుపునిచ్చారు, బుదవారం ఆయన స్థానిక పార్టీ కార్యలయంలో కార్యకర్తలతో సమవేశం ఆయ్యారు,ఈ సందర్బంగా మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జరిగే సదస్సుకు పాల్గోనున్నరని ప్రతి మండలాల నుండి స్వచ్చంధంగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావలని కోరార. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉషారాణి,వైస్ ఎంపీపీ రామన్న,సర్పంచ్‌లు రాధిక,బొజ్జ, ఎంపీటీసీ సత్రుగున్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కిరణ్,ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, మండల కన్వీనర్ సంపత్‌కుమార్,మాజీ జెడ్పిటీసీ సభ్యుడు శ్రీరాములు,నాయకులు సాంబ, నర్సింగ్,నాయక్,నాగేస్,రాముర్తి,జీనబంధు, తదితరులు పాల్గోన్నారు.

**సీఎం జగన్ సభపై విస్తృత ప్రచారం**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

**డుంబ్రిగుడ/హుకుంపేట/అనంతగిరి:** విశాఖలో ఈనెల 27న జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహాసభపై వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామాల్లో విస్తృతం ప్రచారం చేస్తున్నారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా డుంబ్రిగుడలో నాయకుడు సింహాద్రి, హుకుంపేటలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సింహాచలం, జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండలరావు, నాయకులు సింహాచలం , రాజరావు, రాంబాబు, చిన్నేశ్వరరావు, అనంతగిరిలో నాయకులు చిన్నారావు , గంగన్నదొర, సర్పంచ్‌లు సింహద్రి, సన్యాసిరావు, కృష్ణమూర్తి, ధర్మనాయుడు, చిన్నారావు, డొంబు పాల్గొన్నారు.

## అజాగ్రత్తగా వాహనం నడిపితే చర్యలు

**జి.మాడుగుల:** మద్యం సేవించి వాహనం నడిపిన, అజాగ్రత్తగా డ్రైవింగ్ చేసిన వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని బొయితిలి సర్పంచ్ లసంగి మాలన్న అన్నారు. ఈ సందర్బంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పూటుగా మద్యం సేవించి వాహనాలు అజాగ్రత్తగా నడపటం వలన అమాయకుల ప్రాణాలు బలవుతున్నాయని, మృతుడి కుటుంబ సభ్యులు వీధిన పడవలసి వస్తుందన్నారు.గిరిజన ప్రాంతాలకు వచ్చే టూరిస్టు వాహనాలపై పోలీస్‌శాఖ నిఘా ఉంచి,అజాగ్రత్తగా తాగి నడిపే వాహనదార్లపై కఠిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

**జి.మాడుగుల:** మండల కేంద్రంలో వెలుగు కార్యాలయ ఆవరణలో గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు వైఎస్సార్ ఆసరా పథకంలో నాలుగో విడత నిధులను డ్వాక్రా మహిళలకు అందజేయనున్నట్టు ఎంపీఎం సుందరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పాడేరు సమన్వయ కర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు ముఖ్యఅతిధులుగా పాల్గొంటున్నట్టు తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

**రాజవొమ్మంగి:** జడ్డంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతఉదయ భాస్కర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు శింగిరెడ్డి రామకృష్ణ తెలిపారు. ఈ సమావేశానికి మహిళాస్వయం సహాయ గ్రూపులకు చెందిన అక్క చెల్లెమ్మలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొవాలని కోరారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు తరలిరావాలన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**చింతూరు:** రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని చింతూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆనందరావు ఆధ్వర్యంలో బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై ఆటో, ప్రైవేట్ వాహన డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ వాహనదారులంతా తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సుతో పాటు ఇతర పత్రాలు కలిగి ఉండాలన్నారు. ప్రతి వాహనచోదకుడు వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్సు, ఫిట్‌నెస్, ఆర్‌సీ తదితర ధ్రువపత్రాలను కలిగి ఉండాలన్నారు. చింతూరు ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించవద్దని సూచించారు. మద్యం సేవించినా, అతివేగంగా వాహనాలు నడిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసిస్టెంట్ ఎంవీఐ శ్వేతసాయి మాట్లాడుతూ నకిలీ ఏజంట్ల పట్ల వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు జరిగినప్పుడు నకిలీల వలన నష్టం జరిగే అవకాశముందని తెలిపారు. ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే మానవతా దృక్పథంతో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించాలని ఆమె సూచించారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసరావు

## ఆక్రమణదారులపై చర్యలకు వినతి

**చింతూరు:** ఆదివాసీ భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు బుధవారం చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరిషత్ ప్రతినిధి కుంజా శ్రీను మాట్లాడుతూ ఎటపాక మండలం లింగాలపల్లి పరిధిలో 80 ఎకరాల ఆదివాసీల భూములను గిరిజనేతరులు ఆక్రమించుకున్నారని తెలిపారు. అట్టి భూములకు పోలవరం ముంపులో పరిహారం కాజేయాలని చూస్తున్నారని, సదరు భూములకు సంబంధించిన రికార్డులు పరిశీలించి ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అశోక్‌కుమార్, రాజు, రాములు, కృష్ణమూర్తి, కన్నయ్య, రాంబాబు పాల్గొన్నారు.



పీవో చైతన్యకు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ నాయకులు



గంగవరంలో జరిగిన రోడ్‌షోలో ఎమ్మెల్సీ అనంతబాబుకు గజమాలతో సత్కారం

## బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



చింతూరులో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చైతన్య




అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్



అనంతగిరిలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాంబాయి



రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న సీడీపీవో దేవమణి



పెదబయలు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, ఎంపీడీవో



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య



మాట్లాడుతున్న సీడీపీవో విజయగౌరి

**చింతూరు:** ప్రస్తుత పోటీ సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో రాణించడం , ముఖ్యంగా చదవులో ప్రతిభను చాటుకోవాలని ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. జాతీయ బాలికల వారోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యలో ప్రతిభ కనబరచడంతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నతంగా రాణించాలని ఆయన తెలిపారు. ఏపీవో కంచర్ల సుజాత, సీడీపీవో విజయగౌరి పాల్గొన్నారు.

**అరకులోయ రూరల్/అనంతగిరి/పెదబయలు/ చింతపల్లి రూరల్/రాజవొమ్మంగి/ఎటపాక:** జిల్లాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బాలికలు మానసికంగా దృడంగా ఉండాలని, అన్ని రంగాల్లో బాలికలు రాణించాలన్నారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాలికలు విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, తదనుగుణంగా మార్గాన్ని అనుసరించాలన్నారు. మండల కేంద్రంలోని డిగ్రీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ పుష్పరాజు, అధ్యాపకులు అనితకుమారి, సుందరిరాణి,కొండబాబు, కృష్ణమోహన్, గురయ్య, రాజు, లచ్చన్న, కామేశ్వరావు, అన్నపూర్ణ, అంబిక తదితరులు పాల్గొన్నారు. అనంతగిరిలో తహసీల్దార్, ఐసీడీఎస్ సీడీపీవో అచ్యుతాంబ తదితరులు పాల్గొన్నారు. పెదబయలులో ఎంపీపీ బొండా వరహాలమ్మ, ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు. చింతపల్లిలో జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య , ఎస్ఐ అరుణ్‌కిరణ్, ఎంఈవో వనపల ప్రసాద్, ఎంపీడీవో ఆశాజ్యోతి, హెచ్ఎం కొండలరావు, ఐసీడీఎస్ సీడీపీవో రమణి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ట్రైకర్ డైరెక్టర్ లోవరాజు, నాయకుడు గణబాబు తదితరులు పాల్గొన్నారు. రాజవొమ్మంగిలో ఐసీడీఎస్ సీడీపీవో దేవమణి , హెచ్ఎం నాగసుశీల తదితరులు పాల్గొన్నారు.ఎటపాకలో ఐసీడిఎస్ సీడీపీఓ , కేజీబీవి ప్రత్యేకాధికారి కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

**అడ్డతీగల:** మండలంలోని తిమ్మాపురంలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డీజీఎం ప్రకాశ్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుపై రైతులు మెలకువలు తెలుసుకుని అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఆయిల్‌పామ్ విస్తరణ, రాయితీలు, యాజమాన్య పద్ధతులు, బిందు సేద్యం, ఎరువుల యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. నరేష్, దుర్గాప్రసాద్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.